# కర్తవ్యం

రచన: ఆర్. ఆర్. విజయకుమారి.

ఆ వీధి రెండుగా చీలివుంది.

కుడివైపు చీలిక చివరిలో ఓ పెంకుటిల్లుంది. ఆ పెంకుటింట్లో ఓ స్త్రీ అనారోగ్యంతో బాధపడుతోంది. మన దేశంలో నిరుద్యోగ సమస్యలా పెరిగిపోతున్న ఆమె జ్వరాన్ని చూస్తుంటే ఆమె భర్తకు గుండె పాడలెత్తి పోతోంది.

అతను దీనంగా భార్య కళ్ళల్లోకి చూస్తూ, ఏదో ఆలోచిస్తున్నట్టు కనుబొమలు చిట్లించి చూశాడు.

అతని భార్య వనజ నీరసంగా మెల్లగా కళ్ళు తెరచి భర్త ముఖంలోకి చూసింది, ఒక క్షణం ఆగి గాఢంగా నిట్టూర్చింది. ఆమె నిట్టూర్చటానికి - ఆమె భర్త అలా కనుబొమలు చిట్లించడానికి ఓ ప్రబలమైన కారణమే వుంది!

ఆ రోజు వచ్చిన ఉత్తరం వారిద్దరి సున్నిత హృదయాల్లో తుఫాన్ చెలరేపింది.

కొద్ది క్షణాలకి ఆ ఉత్తరం మోసుకొచ్చిన విషయం పైనవారి సంభాషణ సాగింది.

"అత్తయ్యకు అంత ప్రమాదంగా ఉన్నప్పుడు మీరు కేవలం నా కోసం - నా ఆరోగ్యం కోసం వెళ్ళనంటం ఏమంత బాగో లేదు': అంది ఆమె.

గొంతులో బాధతాలూకు జీర! కంఠంలో జ్వరం తాలూకు వణుకు!

అతను ఒక రెండు క్షణాలదాకా ఏమీ మాట్లాడలేక పోయాడు. అలాగే భార్య ముఖంలోకి - కాంతి లేని ఆమె కళ్ళలోకి చూస్తూ ఉండిపోయాడు. తర్వాత ఒక క్షణానికి నెమ్మదిగా కంఠం పెకల్చుకున్నాడు.

"చూడు, వనజా! ఈ స్థితిలో నిన్నొక్కర్తెనే వదిలి నేనెలా వెళ్ళగలను? ఎలా వెళ్ళగలుగుతాననుకున్నావ్? చెప్పు వనజా! నీ మనస్ఫూర్తిగా చెప్పు! నా నిర్ణయం మంచిదో కాదో?..."

చివరి మాటల్లో ఉద్రేకం దొర్లినా కంఠంలో బాధ తాలూకు వణుకు విషాద సంగీతంలా ప్రతి ధ్వనించింది.

భర్తకి ఏం సమాధానం చెప్పాలో తోచక నిస్సహాయంగా అతని ముఖంలోకి చూడసాగింది వనజ.

అతని మెదడులో ఏవో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. ఇటు భార్య! అటుతల్లి! ఎవరు ఎక్కువ?... ఆ ఆలోచన రాగానే అతని మస్తిష్కం ఏ ఒడ్డుకీ చేరకుండా తుఫాన్ తాకిడికి నడి సముద్రంలో బలైపోయే ఓడలా తయారయింది. 'ఎవరు ఎక్కువ?' అన్న ఆలోచన రాగానే అతని ఆలోచనలు హఠాత్తుగా ఆగిపోయే. విద్యుత్తు ప్రసారంలా - కుళాయిలో నీటి రాకలా కొద్ది క్షణాలు ఆగి మళ్లీ ఆలోచనలు రాసాగేయి.

అతను నిన్న వాళ్ళమ్మను రమ్మని-కోడలికి చాలా సుస్తీ చేసిందనీ ఉత్తరం రాశాడు. బహుశా అది వాళ్ళకు అందినప్పుడయినా తన పరిస్థితి తెలుసుకుని తనను మన్నిస్తారని అనుకొని అక్కడికి వెళ్ళకుండా వుండటానికే నిర్ణయించుకున్నాడు.

భార్య కోరికమీద అతను ఈ నాల్రోజుల క్రితమే అతని అత్తగారికి-ఆమె కూతురి విషయం తెలియపరుస్తూ వెంటనే ఇక్కడికి రావాల్సిందని రాశాడు. ఒక వేళ ఆమెగారు గనక రావటం సంభవిస్తే అతను తన తల్లిని చూడడానికి వెళదామనికూడా 'తన నిర్ణయంతో పాటే' అనుకున్నాడు.

అతని అత్తగారు ఉత్తరం అందగానే ఓ రెండ్రోజులు ట్రెయిన్‌లో ప్రయాణంచేసి రానే వచ్చింది. ఆమె రాగానే అతను తల్లిని చూడటానికి బాధ బరువెక్కిన హృదయంతో బయలుదేరాడు.

వేగంగా కొట్టుకునే గుండెలో తన ఇంటిని దూరం నించి చూస్తూనే అతని మనసు ఏదో శంకించింది. దానికి తగ్గట్టుగా అతనికి బాగా తెల్సిన ఓ రైతు అతనికి ఆ క్షణంలోనే ఎదురుపడి - "తల్లికి అంత ప్రమాదంగా వున్నా రాని కొడుకూ ఒక కొడుకేనా" అన్నాడు. తల్లిప్రేమ అంటే ఏమిటో తెలియనివాడని అన్నాడు. చివరికి చావు కబురుచల్లగా చెప్పాడు.

ఆ వార్త వినగానే అతని హృదయం బావురుమంది, దుఃఖంతో నిండిపోయింది. వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ తన ఇంటి గుమ్మంలో అడుగుపెట్టాడు.

గుమ్మంలోనే ఎదురువచ్చాడు అతని తండ్రి, తనతండ్రిని చూడగానే ఒక్కసారిగా అతని ముఖం వాలిపోయింది. ఆ క్షణంలో తన తండ్రిని కౌగిలించుకుని భోరుమని ఏడవాలనిపించినా ఏడవలేకపోయాడు. కడసారిగానైనా తన తల్లిని చూడకపోయినందుకు అతను ఎంతగా కుమిలి పోతున్నాడో ఆ తండ్రి గ్రహించాడు. తల్లికి దహన క్రియలుకూడా చేయలేకపోయినందుకు తన కొడుకు ఎంత వ్యథ చెందుతున్నాడో, ఆ తండ్రి అర్థం చేసుకున్నాడు.

ఆప్యాయంతో కూడుకున్న విచారంతో తన కుడి చేతిని కొడుకు భుజంమీద వేస్తూ-

"విచారించకు గోపీ! పరిస్థితులు అలా వచ్చినప్పుడు నీవుమాత్రం ఏంచేస్తావ్? కాని ఆఖరిసారిగా మీ అమ్మ నీ కోసం ఎంత పరితపించిందో తెలుసా!?..."

ఆ ముసలాయన కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. ఇహ గోపాలరావు తన దుఃఖాన్ని దిగమింగలేకపోయాడు.